క్లుప్తంగా

బ్రోచర్ విడుదల



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

మణికొండ: ప్రముఖ నిర్మాణ రంగ సంస్థ గ్రీన్ స్పేస్ కోకాపేటలో ఆదివారం కొత్త వెంచర్ ఎలస్టైల్ బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎ.గోవిందరెడ్డి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధిలో రూ. 5 కోట్లతో పేద విద్యార్థుల చదువులు, పేదలకు మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేస్తామని ప్రకటించారు. సామాన్యులకు గృహ సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును చేపట్టామన్నారు.

విటారా ఎక్స్‌పీరియన్స్ డ్రైవ్

గచ్చిబౌలి: విటారా ఎక్స్‌పీరియన్స్ డ్రైవ్ హుషారుగా సాగింది. మారుతి సుజుకి ప్రీమియం నెక్సా యొక్క గ్రాండ్ విటారా ఎక్స్‌పీరియన్స్ డ్రైవ్‌ను నగరంలో ఆదివారం నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో సరికొత్త గ్రాండ్ విటారా కారు సామర్థ్యాన్ని ఎక్స్‌పీరియన్స్ ఆఫ్ రోడ్ డ్రైవర్స్ బృందం కస్టమర్లకు నడిపి చూపించారు. ఏడు రకాలైన అత్యంత కఠినమైన దారులలో కస్టమర్లు నడిపారు. దీంతో 100 బుకింగ్‌లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

వేసవిలో నీటి సరఫరాలో కోతలుండవ్

గోల్కొండ: వేసవిలో నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని టోలిచౌకి పరిసర బస్తీలలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు నీటి సరఫరాపై ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నీటి సరఫరాలో ఎటువంటి కోతలు లేవని, వేసవిలో సైతం ఎలాంటి కోతలు లేకుండా సరఫరా చేస్తామని చెప్పారు. నీటి కోతలు ఉండవని ఇప్పటికే జలమండలి అధికారులు స్పష్టంగా తెలిపారని ఆయన అన్నారు. పలు ప్రాంతాలలో సాంకేతిక కారణాల వల్ల నల్లాల్లో నీరు రాకపోయే అవకాశం ఉంటుందని, అలాంటి సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు.

'తెలిసినవాళ్ల నుంచే లైంగిక వేధింపులు అధికం'

గన్‌ఫౌండ్రీ: సమాజంలో ఏం జరుగుతుందో ప్రతి మహిళ తెలుసుకోవాలని హైకోర్టు జడ్జి రాధారాణి అన్నారు. సమాజంలో 90 శాతం లైంగిక వేధింపులు తెలిసినవాళ్ల నుంచే ఎదురవుతున్నాయన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో వి ఫర్ ఉమెన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు చదువుతో పాటు ధైర్యం ఉండాలని సూచించారు. పేదరికంలో ఉన్నటువంటి మహిళలను ఉద్యోగాల పేరుతో లైంగికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న మహిళలు బయటకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ రంగాలలో రాణిస్తున్న పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో గాయని కౌసల్య, ఎన్‌సీసీ అధికారి జయసుధ, సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ ప్రతిభలక్ష్మి పాల్గొన్నారు.

మాంసం షాపుల యజమానులకు నోటీసులు

చార్మినార్: వీధి కుక్కలు మాంసం షాపుల సమీపంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, కవర్ల నియంత్రణ, మాంసం వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయొద్దని ఆదేశిస్తూ అధికారులు షాపుల యజమానులకు నోటీసులు జారీ చేశారు. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆదేశాల మేరకు ఆదివారం జీహెచ్‌ఎంసీ అధికారులు చార్మినార్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నోటీసులు అందించారు. యాకుత్‌పురా, తలాబ్‌కట్టా తదితర ప్రాంతాల్లో మాంసం, చేపల వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయొద్దని సూచించారు.

టీ-6, ఎఫ్-24 టికెట్లపై అవగాహన

సంతోష్‌నగర్: ఆర్టీసీ ప్రవేశపెట్టిన నూతన టీ-6, ఎఫ్-24 టికెట్లను సద్వినియోగం చేసుకోవాలని మిధాని ఆర్టీసీ డిపో మేనేజర్ కె.ఆంజనేయులు సూచించారు. మిధాని ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులకు ఈ టికెట్ల గురించి ఆదివారం అవగాహన కల్పించారు. కోఠి ఉమెన్స్ కాలేజీ, మెడికల్ కాలేజీ, బస్ టెర్మినల్, బాలాపూర్ ఎక్స్ రోడ్డులో మిధాని ఆర్టీసీ సిబ్బంది కరపత్రాలతో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రస్తుతం అమలులో ఉన్న టీ-24 టికెట్టుకు అదనంగా టీ-6కు రూ.50లతో 18 ఏళ్లు పైబడిన మహిళలు, 60 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజెన్లకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ టీ-6 హ్యాపీ అవర్స్ టికెట్టుతో హైదరాబాద్ సిటీలో ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, సబర్బన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రయాణించవచ్చన్నారు. ఎఫ్-24 ఫ్యామిలీ టికెట్టు రూ.300లతో నలుగురు కుటుంబ సభ్యులు ప్రయాణించవచ్చని తెలిపారు.

సైబర్..బీ కేర్‌ఫుల్

- పెరిగిపోతున్న ఆన్‌లైన్ మోసాలు
- కేటుగాళ్ల చెరలో సామాన్యులు, విద్యావంతులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు



శంషాబాద్ రూరల్: రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. వీటిపై పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తున్నా ఏదో ఓ చోట సైబర్ నేరగాళ్ల ఊబిలో చిక్కుకుపోతున్నారు. నేటి సమాజంలో మొబైల్ వినియోగం సామాజిక మాధ్యమాలతో ప్రపంచం మన అరచేతిలో ఇమిడినట్లైంది. ఇదే సాంకేతికతను అడ్డుపెట్టుకుని సైబర్ నేరగాళ్లు చాలా సున్నితంగా దోపిడీలకు పాల్పడుతున్నారు. గత ఆరో నెలలుగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో వివిధ రకమైన సైబర్ నేరాలు వెలుగు చూస్తున్నాయి. ఉద్యోగం ఆశతో నిరుద్యోగ యువత, వస్తువుల కొనుగోళ్లతో, చివరకు గేదెల కొనుగోలు కోసం ఆన్‌లైన్‌పై ఆధారపడి రైతులు కూడా మోసపోతున్నారు.

మచ్చుకు కొన్ని..

- ఊట్‌పల్లిలో నివాసముండే శారదాదేవికి గుంటూరులో ఇల్లు ఉంది. ఈ ఇంటిని అద్దెకు ఇస్తానని 'ఓఎల్‌ఎక్స్' యాప్‌లో ప్రకటన చేసింది. గత ఫిబ్రవరిలో ఇది చూసిన ఓ సైబర్ నేరగాడు ఇల్లు అద్దెకు తీసుకుంటానని చెప్పి గూగుల్‌పే ద్వారా డబ్బులు ఇస్తానన్నాడు. ఇందుకోసం ఆమెకు గూగుల్‌పేలో ఓ లింక్ పంపించి ఓపెన్ చేయమన్నాడు. అతను చెప్పినట్లు పిన్ నెంబరు నొక్కడంతో కొద్దిసేపట్లో ఆమె ఖాతా నుంచి రూ.50 వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది.
- మల్కారం గ్రామానికి చెందిన జి.గణేష్ తన ఇంటి అవసరాలకు రూ.50 వేల కోసం 'ఇండియన్ యూనియన్ క్రెడిట్ క్యాష్ లోన్' యాప్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. తర్వాత అతని ఫోన్‌కు వాట్సాప్‌లో ఓ సందేశం వచ్చింది. లోన్ కావాలంటే రిజిస్ట్రేషన్ ఫీజుతో పాటు పలు కారణాలు చెప్పి అతని నుంచి మొత్తం రూ.32 వేలు దోచేశారు. మరో రూ.20వేలు ఇవ్వాలని లేదంటే రిజిస్ట్రేషన్ అగ్రిమెంట్ ప్రకారం కేసు పెడతామంటూ బెదిరించడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించాడు.
- డిగ్రీ చదువుతున్న తొండుపల్లికి చెందిన ఓ యువతి పార్ట్‌టైం ఉద్యోగం కోసం గూగుల్‌లో వెతుకుతుండగా ఆమె ఫోన్‌కు వచ్చిన ఓ లింక్‌ను ఓపెన్ చేసింది. నేరగాళ్లు ఆమెకు పలు రకాల వస్తువులు చూపించి వాటిని కొనుగోలు చేయాలని, అదనంగా డబ్బులు వస్తాయని నమ్మించి పలు దఫాలుగా రూ.1,04,000 కాజేశారు.
- కవ్వగూడకు చెందిన రైతు శ్రీకాంత్‌యాదవ్‌కు వాట్సాప్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తి నుంచి హాయ్ అంటూ మెసేజ్ వచ్చింది. తర్వాత గేదెల ఫొటోలు పోస్టు చేసి వీటిని ధర రూ.1,10,000కు అమ్ముతానని చెప్పాడు. వాటిని కొనేందుకు రైతు ఆసక్తి చూపడంతో పలు రకాల కారణాలు చెపుతూ ఫోన్‌పే ద్వారా రూ.1,31,500 దోచుకున్నారు.

"1903కు సమాచారం ఇవ్వాలి..



సైబర్ నేరానికి గురైతే టోల్‌ఫ్రీ నంబరు 1903కు వెంటనే సమాచారం ఇచ్చి బ్యాంకు అధికారులు, సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. బ్యాంకులు, సంస్థల నుంచి ఖాతాలకు సంబంధించిన వివరాలు అడగరు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఎవరితో కూడా వ్యక్తిగత పిన్ నంబర్లు, పాస్‌వర్డ్‌లు చెప్పరాదు. వీటిపై అవగాహన కల్పించడానికి విద్యార్థులకు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇటీవల న్యూడ్ కాల్స్ ద్వారా వేధింపులకు పాల్పడుతున్నారు. అధికారుల పేరుతో కూడా నకిలీ ఐడీ సృష్టించి డబ్బులు అడుగుతుంటారు. ఇలాంటి వాటిని నమ్మొద్దు.

– ఏ.శ్రీధర్‌కుమార్, ఇన్‌స్పెక్టర్

ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన నూతన కమిటీ సభ్యులు



రాజేంద్రనగర్: మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తనవంతు కృషి చేస్తానని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి వెల్లడించారు. రాజేంద్రనగర్ సర్కిల్ డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు మహనీయుల జీవిత చరిత్రను బోధించాలని వారు చేసిన అభ్యున్నతిని నేటి సమాజానికి వివరించాల్సిన బాధ్యత ఉందన్నారు. భావితరాల భవిష్యత్తుకు పునాదులు వేసిన మహనీయుల అడుగుజాడల్లో సేవ చేయాలన్నారు. వచ్చే నెల జయంతి వేడుకలకు రూ. 5 లక్షల చొప్పున ప్రభుత్వం ద్వారా మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, శ్రీనివాస్, జీవన్‌దాస్, నర్సింహ, పోతురాజ్ యాదయ్య, శంకర్‌రావు, మంత్రి చంద్రశేఖర్, పచ్చ చంద్రశేఖర్, అనుముల జాన్‌పాల్, శ్రీనివాస్, సూర్యం పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



బెల్టులు ప్రదానం చేసిన భాస్కర్‌రెడ్డి

మణికొండ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మౌంట్ లిటేరా జీస్కూల్ చైర్మన్ కె. భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మణికొండ మున్సిపాలిటీ కేంద్రం మర్రిచెట్టు సర్కిల్‌లో ఉన్న త్రైక్వాండో కరాటే అకాడమీలో జరిగిన బెల్టుల ప్రధాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత తరుణంలో పిల్లలకు కరాటే నేర్పిస్తే శారీరక పటుత్వం ఏర్పడుతుందన్నారు. ఆటల్లో పాల్గొంటే పిల్లలకు శారీరక శ్రమ కలిగి అన్ని రంగాలలో రాణించే అవకాశం ఉంటుందన్నారు.

వీధి కుక్కల బెడద లేకుండా చర్యలు

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలో వీధి కుక్కల బెడద లేకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు భారతీయ జనతా పార్టీ డివిజన్ అధ్యక్షులు విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో చిన్నారులపై కుక్కలు దాడులు చేస్తుండటంతో జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆదివారం హైదర్‌గూడ, అత్తాపూర్, కృష్ణానగర్, న్యూఫ్రెండ్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో సిబ్బంది వీధి కుక్కలను పట్టుకుని తరలించారు.



కుక్కలను పట్టుకునేందుకు వచ్చిన సిబ్బంది

గీత కార్మికులకు అండగా రాష్ట్ర సర్కారు



నీరాను తీస్తున్న ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: నీరా సంప్రదాయ ఆరోగ్యవరప్రదాయని అని ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. మున్సిపాలిటీలోని గొల్లపల్లికి చెందిన అశోక్‌గౌడ్ ఏర్పాటు చేసిన 239 ఈత చెట్లకు సంబంధించిన వనాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నీరా ఉత్పత్తులను పెంచడానికి గీతకార్మికులకు రాష్ట్ర సర్కారు అండగా ఉంటుందన్నారు. ఆరోగ్యాన్ని అందించే నీరా ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చేందుకు కూడా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఈత వనాలు పెంచుకునేందుకు ప్రొత్సహిస్తోందని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గీత కార్మికుల సంక్షేమం కోసం నగరం కల్లు దుకాణాలు తెరిపించిందన్నారు. చెట్లపై పన్నులు రద్దు చేయడమే కాకుండా గీతకార్మికులకు ప్రమాద బీమాను కూడా కల్పిస్తోందన్నారు. ప్రతి పల్లెలో కనీసం వంద ఈత చెట్లను పెంచితే కనీసం పదిహేను కుటుంబాలకు ఉపాధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌బండిగోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్, నాయకులు ఆర్. గణేష్‌గుప్తా, చంద్రారెడ్డి, కౌన్సిలర్లు చెన్నం అశోక్, వై. కుమార్, పీఏసీఎస్ చైర్మన్లు దొనాకర్‌గౌడ్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు పోటీలు



పోటీలలో పాల్గొన్న రేఖాయాదగిరి

మణికొండ: అంతర్జాతీయ మహిళా వారోత్సవాలలో భాగంగా నార్సింగి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆదివారం రంగోలి, మెహందీ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాలలో రాణించాలని వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మహిళా వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జి.అరుణజ్యోతి, మహిళలు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములవ్వాలి



టూవీలర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

శంషాబాద్ రూరల్: సమాజసేవలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సూచించారు. శంషాబాద్ పట్టణంలోని కాపుగడ్డకు చెందిన వ్యాపారవేత్త సిద్దురెడ్డి సహాయంతో సార భాగ్యవతికి టూ వీలర్‌ను ఆదివారం ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సిద్దురెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్న గోల్కొండ సొసైటీ చైర్మన్ దొనాకర్‌గౌడ్, నార్సింగ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏ.శ్రీకాంత్‌గౌడ్, మోహన్‌రావు, మోహన్‌నాయక్, సార జంగయ్యగౌడ్, మంచాల రవి, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

గుంతను మూసి.. మ్యాన్‌హోల్ నిర్మించి



గుంతను పూడ్చి మ్యాన్‌హోల్ నిర్మించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

బండ్లగూడ: కార్పొరేషన్ పరిధిలోని గాయత్రీనగర్ కాలనీలో అంతర్గత డ్రైనేజీ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో గుంతలు తవ్వి వదిలేశారు. అక్కడ ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. ఈ క్రమంలో శనివారం గుంతలో ఓ కారు ఇరుక్కుంది. గమనించిన స్థానికులు వెంటనే బయటకుతీయడంలో ప్రమాదం తప్పింది.ఈ సమస్యపై 'గుంతలు తవ్వి వదిలేశారు' అనే శీర్షికతతో ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించారు. గుంతలు మూసి మ్యాన్‌హోల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు.



గుంతలు తవ్వి వదిలేశారు..

ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనం

అభివృద్ధిని చూసి చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: కేంద్ర ప్రభుత్వ పేద కుటుంబాల కోసం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు యువత ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం పలువురు యువకులు బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉండేందుకు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. తెలంగాణలో కేసీఆర్ పాలనపై ప్రజలకు నమ్మకం పోయిందని అందుకే బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీని బూత్‌స్థాయి నుంచి అభివృద్ధి చేసేందుకు కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనార్దన్, సుధాకర్‌రెడ్డి, భాస్కర్, టి.చిన్న, శరణమ్మ, వెంకటరమణరెడ్డి, రామ్‌నారాయణ్‌యాదవ్, రాజేంద్ర పహిల్వాన్, శివకుమార్, ప్రేమ్‌సాగర్‌రాయి పాల్గొన్నారు

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ వేంకటేశ్వర దేవాలయ ఆవరణలో కొత్తగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభమైన కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం హోమాలు ఇతర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. రాజేంద్రనగర్ ప్రధాన రహదారితో పాటు దేవాలయానికి వెళ్లే రహదారిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వివిధ దేవత ప్రతిమలు విద్యుత్ దీపాల అలంకరణతో ఆకట్టుకుంటున్నాయి.



పూజల్లో పాల్గొన్న భక్తులు

నాణ్యమైన హెల్మెట్లనే వినియోగించండి



హెల్మెట్ అందజేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

గోల్కొండ: ప్రమాద సమయంలో వాహనదారుడి ప్రాణాలను కాపాడే సాధనం హెల్మెట్ అని టోలిచౌకి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ అన్నారు. ఆదివారం టోలిచౌకి వీనస్ హైస్కూల్‌లో డ్రాక్స్ ఎస్ సొసైటీ సహకారంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు హెల్మెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్జీవోలు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. హెల్మెట్ పెట్టుకునే వారు బెల్ట్ క్లిప్ పెట్టుకోవడం లేదని, దీని వల్ల ద్విచక్ర వాహనచోదకుడు కింద పడినప్పుడు హెల్మెట్ పడిపోయే ప్రమాదం ఉందన్నారు. వాహనచోదకులు నాణ్యమైన ఐఎస్ఐ ముద్ర కలిగిన హెల్మెట్‌లనే వాడాలని, ఐఎస్ఐ గుర్తు ఉన్న హెల్మెట్లను ఎన్నో పరీక్షల అనంతరం తయారు చేస్తారని చెప్పారు. వీనస్ హైస్కూల్ కరెస్పాండెంట్ హిదాయతుల్లాన్ ఖాన్ మాట్లాడుతూ.. డ్రాక్స్ స్కూల్ సొసైటీ వారు ఐసీఐసీఐ లాంబార్డ్ ఇన్సూరెన్స్ వారితో కలిసి ఈ హెల్మెట్లు అందిస్తున్నారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న విద్యార్థి తండ్రితో పాటు విద్యార్థికి వీటిని అందిస్తున్నట్లు తెలిపారు. డ్రాక్స్ ఎస్ సొసైటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సీమ్‌కార్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు హైదరాబాద్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 12వేల హెల్మెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీలక్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జూనైదీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లమాంబ జయంతి

నాంపల్లి: నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళా మందిరంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను ఇటికాల వీరయ్య ప్రజాపతి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డాక్టర్ జె.పూర్ణచంద్రరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన పలువురు మహిళలకు విశిష్ట వనితా పురస్కారాలు-2023 అందజేశారు. ఐపీఎస్ అధికారిణి సరిత, అవునూరి లక్ష్మీరాజ్యం, నారాయణ, బండారి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో మహిళా దినోత్సవం

చార్మినార్: చెలాపురాలోని దక్షిణ మండలం మహిళా పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి ఆధ్వర్యంలో ఆదివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జానకమ్మతో పాటు ఎస్ఐ అనిత, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు, సిబ్బందిని సలావుద్దీన్ సత్కరించి స్వీట్ బాక్స్ అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రవీశ్వర్‌గౌడ్, మహ్మద్ అమీర్, మెహాజబీన్ ఖురేషి, అనూషాగౌడ్, కృష్ణమాలిక్, రమేశ్, రాజు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం ఏకగ్రీవం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆ లేకాలనీస్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ఆదివారం హుడా కాలనీ కమ్యూనిటీ హాల్లో సర్వసభ్య సమావేశం, ఎన్నికల ఫలితాల ప్రకటన కార్యక్రమం నిర్వహించారు. 21 పదవులకు గాను 20 నామినేషన్లు మాత్రమే రావటంతో కార్యవర్గ సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. అధ్యక్షుడిడి. సీతారం మూడో సారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించగా వి. ఆంజనేయులు ప్రధాన కార్యదర్శిగా ఆరోసారి గెలిచారు.

నూతన కార్యవర్గం ఇదే...

ఉపాధ్యక్షులుగా ప్రవీణ, వి. కృష్ణభాస్కర్, ఎస్‌బీ రాజశేఖర్, జె.రామస్వామి, సంయుక్త కార్యదర్శులుగా నిమ్మగడ్డ అనిత, ఎం. కృష్ణకుమార్, పి.రాజలింగం, ఎం. పెంటారెడ్డి, కేజీఎస్ మోహన్, కార్యదర్శులుగా జి.సింహారాజరెడ్డి, ఎం. మాదవరెడ్డి, పి.ప్రభాకర్‌రావు,ఎస్ఎస్ విశ్వనాథ్, అబ్దుల్ సాయిదా, కోశాధికారిగా ఆర్. బాబురావు, సహాయ కోశాధికారిగా వెంకటేశ్వర్‌రావు ఏకగ్రీవంగా కన్నికయ్యారు.



నూతన కార్యవర్గంతో అధ్యక్షుడు సీతారాం

లిఫ్ట్ గోతిలో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన రహమాన్

రాజేంద్రనగర్: లిఫ్ట్ గోతిలో పడి సెక్యూరిటీ గార్డు మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఖలీల్ వివరాల ప్రకారం.. అస్సాంకు చెందిన తోహిద్ ఉర్ రహమాన్(32) బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి చెక్ సెక్యూరిటీ సంస్థలో గార్డుగా చేరాడు. బండ్లగూడలోని వైష్ణవి కొండిన్య అపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వర్తిస్తున్న రహమాన్ శనివారం రాత్రి విధుల్లో భాగంగా ప్రమాదవశాత్తు మొదటి అంతస్తు నుంచి లిఫ్ట్ గోతిలో పడ్డాడు. ఉదయం విధులకు వచ్చిన మరో ఉద్యోగి చూసి ఏజెన్సీకి సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య..

రాజేంద్రనగర్: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాజేంద్రనగర్ పరిధిలో చోటు చేసుకుంది. మాణిక్యమ్మ కాలనీకి చెందిన కరణ్‌సింగ్(27) ఎన్ఐఆర్‌డీ ప్రాంతంలోని శ్మశానవాటికలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఆదివారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కరణ్‌సింగ్ మృతికి గల కారణాలు తెలియలేదని కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రులను ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230